సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



ఆహ్లాదం..ఆకర్షణ @ శిల్పారామం

శిల్పారామాలు ఆకర్షణలకు నిలయాలుగా మారుతున్నాయి. -8లో..



యానిమేటర్ చేతివాటం

స్వయం సహాయక సంఘాల్లో పనిచేస్తున్న ఓ యానిమేటర్ రూ.30లక్షలు స్వాహా చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. -8లో..



ఉద్యోగాల పేరుతో మోసం

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు మోసగాళ్లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. -8లో



న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు

కడప సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నిర్వహిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల అలంకరణతోపాటు నివాళులర్పిస్తారన్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు స్పందన హాలులో వేడుకలు ఉంటాయన్నారు. వైఎస్సార్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల నాయకులు, అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయసంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నడుపుతున్న ఏపీఆర్ స్కూల్ జనరల్, ఏపీఆర్ స్కూల్స్ మైనార్టీ బాలుర, బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందుకు ఈనెల 24వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు https://aprs.apcfss.in వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్ష మే 20వ తేదీ జరుగుతుందని డీఈఓ తెలిపారు.

21న వేళాంగిణికి ప్రత్యేక బస్సు




కడప కోటిరెడ్డిసర్కిల్ : వేళాంగిణికి మైదుకూరు డిపో నుంచి ఈనెల 21వ తేదీన ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు మైదుకూరులో రాత్రి 7 గంటలకు బయలుదేరి కడప, నాగూరు, నాగపట్నం మీదుగా వెళుతుందన్నారు. ఈ బస్సు 22వ తేదీ ఉదయం 8 గంటలకు ముస్లింల పవిత్ర క్షేత్రం నాగూరుకు చేరుకుని 10 గంటలకు వేళాంగిణికి వెళుతుందన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 11 గంటలకు వేళాంగిణి నుంచి బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు కడపకు, 5.00 గంటలకు మైదుకూరుకు చేరుతుందన్నారు.

180 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన పది సైన్స్ పరీక్షకు 180 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 146 పరీక్షా కేంద్రాల్లో 27704 మంది హాజరు కావాల్సి ఉండగా 27524 మంది హాజరయ్యారు. జిల్లాలోని 56 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్‌స్క్వాడ్, ఎనిమిదింటిని డీఈఓ రాఘవరెడ్డి తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడికి ఉపాధ్యాయ ఉద్యోగం



తన రాజీనామా పత్రాన్ని చూపుతున్న శ్రీనివాసరావు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావుకు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. బుధవారం డీఈఓ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు వెళ్లిన ఆయన సిద్దవటం మండలంలోని దిగువపేట మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాను 1998 డీఎస్సీ పరీక్ష రాసి క్వాలిఫై అయినట్లు చెప్పారు. అప్పటి నుంచి వివిధ కారణాలతో అభ్యర్థుల నియామకం పెండింగ్‌లో పెట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు నియామకాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగం దక్కిన కారణంగా తాను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవితోపాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

పచ్చ.. రచ్చ

జిల్లా తెలుగుదేశం పార్టీలో ఇంటి రచ్చ వీధికెక్కింది. ఈ విషయం టీడీపీ అధినేత జోన్ మీటింగ్ స్థల పరిశీలన నేపథ్యంలో బట్టబయలైంది. దీనిని బట్టి చూస్తే టీడీపీలో వర్గ విభేదాలతోపాటు వ్యక్తిగత ఆధిపత్యం తీవ్ర స్థాయికి చేరిందని స్పష్టమవుతోంది. గతంలో కూడా పార్టీ పదవులు ఇచ్చే సమయంలో కూడా జిల్లాలో ఇలాంటి వర్గవిభేదాలు చాలా చోటుచేసుకోవడం గమనార్హం. తాజాగా ఈ సంఘటనతో విభేదాలు తారస్థాయికి చేరాయి.

- తెలుగుదేశం పార్టీలో తారస్థాయికి వర్గవిభేదాలు
- చంద్రబాబు పర్యటన నేపథ్యంలో స్థల పరిశీలనలో బట్టబయలైన వైనం
- మాజీ శాసనసభ్యుడు, సీనియర్ నేతను దూషించిన మరో టీడీపీ నాయకుడు
- కడప పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధుల సాక్షిగా సంఘటన



సాక్షి ప్రతినిధి కడప : వైఎస్సార్ జిల్లాలో జోన్–5 మీటింగ్‌లో పాల్గొనేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 18న కడపకు రానున్నారు. ఈ సందర్భంగా అందుకు సంబంధించి ఏర్పాట్ల కోసం మాజీ మంత్రి, జిల్లా టీడీపీ పర్యవేక్షకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కన్నబాబు ఆధ్వర్యంలో గురువారం కడప బిల్టప్ సమీపంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ నాయకుడి స్థలాన్ని చూడటానికి వెళ్లారు. చంద్రబాబు మీటింగ్‌ను ఇక్కడ పెట్టాలని, ఆ స్థలానికి చెందిన పార్టీ నాయకుడు సూచించారు. ఇందుకు సంబంధించి పోలీసుల అనుమతి తీసుకునేందుకు గురువారం ఉదయం జిల్లా ఎస్పీని టీడీపీ నాయకులు కలిశారు. ఓ పోలీసు అధికారికి మీటింగ్ ఏర్పాట్ల అనుమతి గురించి జిల్లా ఎస్పీ బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులతో మీటింగ్ ఏర్పాటు కోసం రెండు ప్రదేశాలు చూపించాలని, అందులో ఏది సౌకర్యం అయితే దానిని జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చి అనుమతి మంజూరు చేస్తామని ఆ పోలీసు అధికారి టీడీపీ నాయకులతో చెప్పినట్లు సమాచారం.ఈ మేరకు కడప పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఇతర టీడీపీ నాయకులు మీటింగ్ స్థల పరిశీలన కోసం బిల్టప్ వద్దకు పోలీసుశాఖ సిబ్బంది, మీడియా ప్రతినిధులతో సహా వచ్చారు. మీటింగ్ నిర్వహణకు రెండు స్థలాలు ఎంపిక చేసుకోవాలని పోలీసుశాఖ తరపున ఆ అధికారి టీడీపీ నాయకులకు సూచించారు. ఒక స్థలం కడప బిల్టప్ వద్ద కాగా, మరో స్థలం ఎక్కడ చూడాలని కడప పార్లమెంటుకు చెందిన టీడీపీ మాజీ శాసనసభ్యుడైన పార్లమెంటు ముఖ్య నేత అటుండంగా.. అంతలోనే కలగజేసుకున్న ఆ స్థలానికి చెందిన మరో టీడీపీ నాయకుడు నోరు మూసుకోరా అంటూ పత్రికల్లో రాయలేని భాషతో దుర్భాషలాడారు. కేబినెట్ హోదా అనుభవించిన ఆ సీనియర్ నాయకుడిని అసభ్యపదజాలంతో దూషించడంతో అక్కడున్న వాళ్లంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఆ కారణంగా మరో స్థలం ఎక్కడున్నది అని అంటుండగానే సీనియర్ నాయకుడు, మాజీ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తిని ఉద్దేశించి అలా మాట్లాడటం ఏమాత్రం సబబు కాదని అక్కడున్న వాళ్లంతా వారిలో వారు గుసగుసలాడుకోవడం కనిపించింది. అయితే ఎవరూ ఆ నాయకుడిని ప్రశ్నించే ధైర్యం చేయలేకపోయారు. టీడీపీ నాయకులు, పోలీసులు, మీడియా ప్రతినిధులుగా సాక్షిగా జరిగిన ఈ సంఘటన టీడీపీలో అంతర్గత విభేదాలకు భారీ ఎత్తున ఆజ్యం పోస్తుందన్న భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కాగా దూషణలు తిన్న కడప పార్లమెంటు ముఖ్య నేత, మాజీ శాసనసభ్యుడు అయిన ఆయన మరోమాట మాట్లాడకుండా అక్కడి నుంచి ముఖం చిన్నపుచ్చుకుని కడపలోని పార్టీ కార్యాలయానికి వెళ్లిపోయినట్లు సమాచారం.

ఏఎఫ్‌యూ ఏర్పాటుకు వడివడిగా అడుగులు

ఏఎఫ్‌యూ : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం శాశ్వత భవన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవలే 110.36 ఎకరాల భూమిని కేటాయించింది. పెండ్లిమర్రి మండలం గంగనపల్లి గ్రామపరిధిలోని 17/1, 17/2 సర్వేనెంబర్‌లో ప్రభుత్వం భూమి కేటాయించడంతో, ఏఎఫ్‌యూ అధికారులు గురువారం స్థలపరిశీలన చేపట్టారు. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డిలు ప్రభుత్వం కేటాయించిన భూమిని పరిశీలించారు. రెవెన్యూశాఖ భూమిని విశ్వవిద్యాలయానికి అప్పజెప్పాల్సి ఉండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి చర్చించారు. రెవెన్యూశాఖ భూమిని అప్పజెప్పిన వెంటనే పనులు ప్రారంభించేలా సరిహద్దులను స్థానిక రెవిన్యూ అధికారుల సహాయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని డ్రోన్ సహాయంతో చిత్రీకరించి, లెవలింగ్ చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్‌లు మాట్లాడుతూ అనుకున్నవన్నీ నిర్దేశించిన గడువులోపు పూర్తయితే జూలై 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో శంకుస్థాపన చేయించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం గంగనపల్లి వీఆర్‌ఓ పృథ్వీరాజ్, సర్వేయర్ సుబ్బరాయుడు సహకారంతో ఏఎఫ్‌యూ సిబ్బంది సరిహద్దులను గుర్తించి, మార్కింగ్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎఫ్‌యూ సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, వై. అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.



గురుకులం భవనాలను పరిశీలిస్తున్న వైవీయూ, ఏఎఫ్‌యూ వీసీలు, రిజిస్ట్రార్‌లు

గురుకులం భవనాల పరిశీలన

యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఉన్న గురుకులం భవనాలను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్ధన, వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్‌లు పరిశీలించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ శాశ్వత భవనాల నిర్మాణాలకు వైవీయూ పక్కనే ప్రభుత్వం భూమి కేటాయించడంతో గురుకులం భవనాల నుంచి పరిపాలన, తరగతుల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందేమోనన్న ఆలోచనతో భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి, అధ్యాపకులు ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఆచార్య టి. శ్రీనివాస్, ఆచార్య విజయభారతి, డా. పి. సరిత, ఇంజినీర్లు నాగేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఏడీ సెట్–23 కమిటీ ఏర్పాటు



చైర్మన్‌గా నియమితులైన బి. ఆంజనేయప్రసాద్



కన్వీనర్ ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి

ఏఎఫ్‌యూ: ఆర్ట్, డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏడీ సెట్)–2023కు సంబంధించిన కమిటీని ఏర్పాటు చేస్తూ ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఏడీ సెట్ నిర్వహించనున్నారు. ఏడీ సెట్–2023 చైర్మన్‌గా డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్‌ను, కన్వీనర్‌గా రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డిని నియమించారు. వీరితో పాటు సభ్యులుగా ఆచార్య వై. నజీర్‌అహ్మద్ (ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి), పి. సంతోష్‌కుమార్ (ఎస్.పి.ఏ. విజయవాడ), ఆచార్య జి.విశ్వనాథకుమార్ (ఏయూ, విశాఖపట్నం), డా. మృత్యుంజయరావు (వైవీయూ), డా.ఎం.సుధీర్‌రెడ్డి (స్పెషలాఫీసర్, ఏపీ ఉన్నతవిద్యామండలి), డా. జి. మాధవి (అసిస్టెంట్ స్పెషలాఫీసర్, ఏపీ ఉన్నతవిద్యామండలి)ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పక్కా ప్రణాళికతో జగనన్న విద్యాకానుక పంపిణీ

కడప ఎడ్యుకేషన్: జగనన్న విద్యాకానుక(జేవీకే) –4 పంపిణీకి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నామని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జేవీకే రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన జేవీకే స్టోరేజీ పాయింట్లను రాష్ట్ర పరిశీలకుడు పరిశీలించారు. గురువారం సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిని కలిసి జిల్లాలోని వివిధ స్టోరేజీ పాయింట్ల వివరాలు, భద్రతకు చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. మండలాల వారీగా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి జేవీకే కిట్లు విద్యార్థులకు సకాలంలో అందేలా చూస్తామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కిట్ల భద్రతపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్టోరేజీలను పరిశీలించి మండల విద్యాశాఖాధికారులతో మాట్లాడి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను సూచించామన్నారు. సమావేశంలో సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి మిట్టా కేశవరెడ్డి, కొండా దశరదరామిరెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణతో చర్చిస్తున్న సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

రేపు మెగా జాబ్ మేళా

రాజంపేట:ఈనెల 15న రాజంపేటలోని ఏఐటీఎస్ క్యాంపస్‌లో మెగా జాబ్‌మేళాను ఎంపీ మిథున్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం ఏఐటీఎస్ క్యాంపస్‌లో ఏర్పాట్లను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాకు 80కి పైగా బహుళజాతి కంపెనీల ప్రతినిధులు వస్తారన్నారు. నిరుద్యోగులకు ఉచిత బస్సు, భోజన సౌకర్యం కల్పించామన్నారు.

జాబ్‌మేళాలో పాల్గొనే వారి కోసం..

ఏఐటీఎస్ క్యాంపస్‌లో నిర్వహించే మెగా జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగుల నమోదు కోసం క్యూ ఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. వివరాలకు 9740212687, 9885797909, 94914 75836 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యోగివేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.రంగజనార్ధన్ తెలిపారు. గురువారం వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం చాలా విలువైందని, విద్యార్థులు దానిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. యోగివేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైవీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో యోగివేమన యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు హరినారాయణ, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు సేవాపతకాలు

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలను అందిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పతకాలను ప్రకటిస్తూ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు జాబితాను విడుదల చేశారు. వైఎస్సార్ జిల్లాలో ఒకరికి ఉత్తమ సేవాపతకం, ఐదుగురికి సేవాపతకాలన ప్రకటించారు. ఉగాది (తెలుగు సంవత్సరాది) సందర్భంగా జాబితాను ప్రకటించి గురువారం విడుదల చేశారు. సేవాపతకాలు సాధించిన వారిలో ఇంకా భాకరాపేటలోని 11వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పి. చంద్ర మోహన్ రెడ్డి (హెచ్‌సి 339), మరో హెడ్ కానిస్టేబుల్ ఎం. చంద్రశేఖర్ (హెచ్‌సీ 738)లు ఉన్నారు.

అధికారి పేరు	పనిచేస్తున్న ప్రదేశం	పతకం
కె.కె. రెడ్డి –ఏఆర్ఎస్ఐ	11వఏపీఎస్‌పిబెటాలియన్	ఉత్తమసేవాపతకం
కె.వి రంగారావు, ఆర్ఐ	11వ ఏపీఎస్‌పి బెటాలియన్	పోలీసు సేవాపతకం
ఆర్. అన్వర్, ఏఎస్ఐ	బద్వేల్ రూరల్	పోలీసు సేవాపతకం
రాచరాయుడు, ఏఎస్ఐ	రిమ్స్ పిఎస్, కడప	పోలీసు సేవాపతకం
జయలక్ష్మి, డబ్ల్యు ఏఎస్ఐ	వల్లూరు పిఎస్	పోలీసు సేవాపతకం
రామసుబ్బయ్య, హెచ్‌సీ	డిఏఆర్ కడప	పోలీసు సేవాపతకం

అన్నమయ్య ప్రాజెక్టుకు ఎస్ఎల్‌టీసీ ఆమోదం

కడప సిటీ : ఎట్టకేలకు అన్నమయ్య ప్రాజెక్టుకు మహర్దశ పట్టింది. స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ రాఘవ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ వేసిన టెండరును ఖరారు చేస్తూ ఇటీవల ఆమోదం తెలిపింది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే పనులు ప్రారంభమయ్యాయి. 2021 నవంబరు 19న వరద ఉధృతికి అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటించి అన్నమయ్య ప్రాజెక్టు పటిష్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమేరకు 2022 డిసెంబరు 26న టెండర్లను ఆహ్వానించారు. ఆన్‌లైన్ టెండర్లలో రెండు కంపెనీలు కోట్ చేయగా రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఈ టెండరును దక్కించుకుంది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 660 కోట్లకు టెండరు వేశారు. సంబంధిత అగ్రిమెంటు కూడా పూర్తయింది. ప్రస్తుతం సర్వే పనులు జరుగుతున్నాయని ఇరిగేషన్‌శాఖ ఎస్‌ఈ శ్రీనివాస్ తెలిపారు.

భానుడి భగభగ..ప్రజలు విలవిల

- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు



కడప అగ్రికల్చర్: భానుడు నాలుగైదు రోజుల నుంచి భగభగమంటున్నాడు. పగటిపూట తీవ్రమైన ఎండలతో సెగలు కక్కుతున్నాడు. అర్ధరాత్రి నుంచి వాతావరణం కాస్త చల్లబడటంతో కొంత ఉపశమనం కలిగిస్తోంది. జిల్లాలో నాలుగైదు రోజుల నుంచి ఈ పరిస్థితి కొనసాగుతోంది. ఉదయం 11 గంటల నుంచే భానుడి ప్రతాపం చూపుతుండటంతో వేడికి జనం అల్లాడి పోతున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకల్లా రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల తీవ్రతను తట్టుకోలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండతీవ్రత నుంచి తప్పించుకోవడానికి కొందరు గొడుగులు, మరికొందరు టోపీలు వాడుతున్నారు.ఈ సీజన్‌లో ఇప్పటికి అత్యధికంగా పగటి ఉష్ణోగ్రత 40.6 డిగ్రీలు చేరకుంది. రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం 24.1 డిగ్రీలలో నమోదవుతోంది. వేడిగాలులు పెరగడంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

వేడిగాలులు

జిల్లాలో సూర్యతాపానికి తోడు వేడి గాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు బయటికి రావాలంటే జంకుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేవాళ్లు కూడా మధ్యాహ్నానికల్లా ఇళ్లకు చేరిపోతున్నారు. వైద్యులు కూడా ఎండలకు బయట తిరగవద్దని సూచనలు, సలహాలను ఇస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఎండల తీవ్రత అధికం కావడంతో కడప నగరంలో ఫుట్‌పాత్ వ్యాపారులు కూడా నీడ కోసం ఏర్పాట్లు చేసుకుని తమ వ్యాపారాలను సాగిస్తున్నారు.

- ఎండతాపం తీర్చుకునేందుకు జనాలు చల్లటి పానీయాలను తాగేందుకు ఎగబడుతున్నారు. ఏదిఏమైనా ఎండలకు జాగ్రత్తలు వహించపోతే వడదెబ్బకి గురి కాకతప్పని వైద్యులు చూసిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు ఇలా ...

- ఒక్కసారిగా శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమట పట్టకపోవడం, పాక్షికంగా అపస్మారక స్థితి కలగడం జరుగుతుంది.
- శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం జరుగుతుంది.
- వేడి వల్ల చెమట పట్టి శరీరంలోని లవణాలు తగ్గిపోతాయి. నీటి నిష్పత్తి తగ్గుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా గొడుగు లేదా టోపీ వాడాలి.
- తెలుపురంగు, పలచటి వస్త్రాలు, లూజుగా ఉన్న దుస్తులనే ఉపయోగించాలి.
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్ర 4 గంటల మధ్యలో ఆరుబయట తిరగకూడదు
- వీలైనని సార్లు నీరు తాగడం, ఎండలో తిరిగే సమయంలో కొబ్బరినీరు, మజ్జిగ, నీటిలో నిమ్మరసం, కాస్తంత ఉప్పు కలిపిన ద్రావణాన్ని తీసుకోవాలి.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం , వికారంగా ఉండటం జరిగితే తక్షణం వైద్యులను సంప్రదించాలి

జిల్లాలో ఐదు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	కనిష్టం	గరిష్టం
09.04.23	23.0	36.6
10.04.23	24.1	37.1
11.04.23	20.2	38.2
12.04.23	20.8	39.1
13.04.23	24.8	40.6

జాగ్రత్తలు తప్పనిసరి



వడదెబ్బకు గురైన వ్యక్తిని ముందుగా చల్లని ప్రదేశంలో ఉంచాలి. చల్లటి తడి గుడ్డతో ఒళ్లంతా తుడవాలి. ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చల్లని గాలి తగిలేలా చర్యలు తీసుకోవాలి. తర్వాత ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాపించాలి. తర్వాత వైద్యుడిని సంప్రదించాలి.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ అవ్వారు, అర్జున్‌కుమార్, వైద్యుడు

వర్చువల్ విధానంలో ప్రధాని చేతుల మీదుగా నియామకం



వర్చువల్ విధానంలో నరేంద్రమోదీ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న పి. కిశోర్

వైవీయూ : వైఎస్ఆర్ కడప జిల్లా మాధవరం–1 గ్రామానికి చెందిన డాక్టర్ పి. కిశోర్ వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకపత్రాన్ని అందుకున్నారు. గురువారం గుంతకల్లులో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవలే కర్నూలు ఐఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ– డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్)లో లెవల్–2 అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికైన ఈయనకు నియామకపత్రాన్ని అందజేశారు. కాగా ఈయన ఇంటర్ వరకు కడప సెయింట్‌జోసఫ్ జూనియర్ కళాశాల, డిగ్రీ సుబ్బిరెడ్డి కళాశాలలోను, పీజీ కావలి పీజీ సెంటర్‌లోను, పీహెచ్‌డీ ఎన్ఐటీ వరంగల్‌లో పూర్తిచేశాడు. గేట్, సీఎస్ఐఆర్–నెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఐఐఐటీ కర్నూలులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యాడు. కాగా ఈయన సతీమణి డా. పద్మావతి కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

గేదెను ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి

కొండాపురం : మండల పరిధిలోని లావనూరు గ్రామ సాయిబాబా గుడి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింహాద్రిపురం మండలం హిమగుంట్ల గ్రామానికి చెందిన సి. చంద్ర (48) మృతి చెందినట్లు కొండాపురం ఎస్ఐ సత్యానారాయణ గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. సింహాద్రిపురం మండలంలోని హిమగుంట్ల గ్రామానికి చెందిన రవీంద్రనాయుడు, చంద్ర కొండాపురం నుంచి తిరిగి తమ స్వగ్రామంకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా లావనూరు సాయిబాబా గుడి దగ్గర రోడ్డుపై చచ్చిపడి ఉన్న గేదెను ఢీ కొన్న ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కడప రిమ్స్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చంద్ర మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. రవీంద్ర నాయుడును కడప రిమ్స్ నుంచి కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆహ్లాదం..ఆకర్షణ @శిల్పారామం


కడప శిల్పారామంలోని కన్వెన్షన్ సెంటర్


కన్వెన్షన్ సెంటర్‌లోని ప్రధాన వేదిక

- అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- రూ. 95.52 కోట్లు కేటాయింపు

కడప కల్చరల్ : శిల్పారామాలు ఆకర్షణలకు నిలయాలుగా మారుతున్నాయి. కోవిడ్ కష్టాలను దాటుకుని క్రమంగా ఆర్థికంగా బలపడుతున్నాయి. సందర్శకులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు స్థానిక ఉత్పత్తుల మార్కెటింగ్‌లకు కూడా వేదికలు కానున్నాయి. పర్యాటకంగా కొత్త ఊపునిస్తున్న వీటిని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. శిల్పారామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 95.52 కోట్లకు పైగా నిధులు కేటాయించింది.

అసలే వేసవి..సాయంత్రం కాగానే ఇళ్లను వదిలి అలా ఆరుబయటకు వెళ్లి సహజమైన చల్లని వాతావరణంలో సేద తీరాలనిపిస్తుంది. జిల్లాలోని శిల్పారామాల్లో అలాంటి అవకాశాలు కల్పిస్తున్నాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వీటిని ఏర్పాటు చేశారు. సందర్శకుల ఆదరణతో రోజురోజుకు ఆర్థికంగా బలపడుతున్నాయి. కోవిడ్ సమయంలో ఆదాయం తగ్గినా ప్రభుత్వం సందర్శకులకు కల్పిస్తున్న మౌలిక వసతుల కారణంగా శిల్పారామాలు అభివృద్ధి బాటపట్టాయి. ప్రభుత్వం వాటిని మరింత ప్రోత్సహించేందుకు రూ. 95.52 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.

స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్

నిన్నటి వరకు కేవలం ఆహ్లాదం పంచడానికి మాత్రమే పరిమితమైన శిల్పారామాలు నేడు స్థానిక ఉత్పత్తుల మార్కెటింగ్‌కు వేదికలుగా మారుతున్నాయి. స్థానిక హస్తకళారూపాల విక్రయ కేంద్రాలుగా సందర్శకులకు తక్కువ ధరకే అందుబాటులో ఉంచుతున్నాయి. ఇందులో భాగంగా ఇటీవల పండుగలు, ఇతర ఉత్సవాలు, వరుస సెలవుల్లో ఇలాంటి వస్తువుల ప్రదర్శన, అమ్మకాలను నిర్వహిస్తున్నారు. ఫలితాలు బాగుండడంతో అలాంటి వస్తువుల విక్రయాలకు శిల్పారామాలను శాశ్వత వేదికలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టిసిపేషన్) పద్ధతిలో శిల్పారామాలను బహుళ ప్రయోజన కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా పనులు సాగుతున్నాయి. ఇటీవల పర్యాటకంగా ప్రాముఖ్యతను సంతరించుకున్న వైఎస్సార్ జిల్లాలో శిల్పారామాల అభివృద్ధి ద్వారా మరింత ప్రాచుర్యం లభించగలదని అధికారులు భావించి ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎనిమిది శిల్పారామాలు ఉండగా వైఎస్సార్ జిల్లాలో కడప, పులివెందులలో ఉన్నాయి. ఇటీవల కొత్తగా ఆవిర్భవించిన అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో, మరోచోట కూడా శిల్పారామాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

సంస్కృతి, వారసత్వ నిలయాలుగా

స్థానిక ఉత్పత్తుల విక్రయాలతోపాటు శిల్పారామాలను సంస్కృతి సంప్రదాయాల నిలయంగా, వారసత్వ రక్షణ కేంద్రాలుగా బహుళ ప్రయోజన రీతిలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆహ్లాదం గొలిపే పచ్చిక బయళ్లతోపాటు శిల్పారామంలో పలుచోట్ల సంస్కృతిని ప్రతిబింబించే రాతి తోరణాలు, శిల్పాలను ఏర్పాటు చేశారు. సంప్రదాయ వేదికపై ప్రతి ఆదివారం ఇతర సెలవు దినాలు, పండుగల్లో స్థానిక కళాకారుల నృత్య, నాటక ప్రదర్శనలను నిర్వహిస్తూ తగిన పారితోషకంతో ప్రోత్సహిస్తున్నారు. ప్రముఖ కళాకారులను రప్పించి తక్కు ఇనుముతో కళ్లు చెదిరే కళారూపాలను తయారు చేయించి ప్రదర్శిస్తున్నారు. ఆకర్షణీయమైన బోట్లను అందుబాటులో ఉంచారు.

శిల్పారామాలు నిత్యం సందర్శకులు, ప్రజలతో కళకళలాడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా నిన్నటివరకు సాధారణంగా కనిపించిన ఫంక్షన్ హాలును కన్వెన్షన్ హాలుగా అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దారు. వేదిక, వధూవరుల గదులు, డైనింగ్ హాలును కూడా పూర్తిగా ఏసీ చేశారు.పక్కనేగల గెస్ట్‌హౌస్‌లోని గదులు, డార్మెటరీల్లో కూడా ఏసీ సౌకర్యం కల్పించారు. కడప నగరంలోని ఇతర ఏ కన్వెన్షన్ సెంటర్లకు తీసిపోని విధంగా ఆధునీకీకరించారు. నిన్నటి వరకు నిధుల లేమితో నీరసంగా కనిపించిన శిల్పారామాల అభివృద్ధిపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో శిల్పారామాలు కొత్తకళను సంతరించుకున్నాయి.

ఉద్యోగాల పేరుతో మోసం

- ఇద్దరు మోసగాళ్ల అరెస్టు
- 12 సీళ్లు, రెండు సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌ట్యాప్ స్వాధీనం



పోలీసుల అదుపులో మోసగాళ్లు, స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లు, సీళ్లు, ల్యాప్‌టాప్

రాయచోటిటౌన్ : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు మోసగాళ్లను అరెస్టు చేసి వారి నుంచి రెండు సెల్ ఫోన్లు, 12 సీళ్లు, ఒక ల్యాప్ ట్యాప్ స్వాధీనం చేసుకున్నట్లు అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. గురువారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ బలిజగడ్డ వీధికి చెందిన పెమ్మా నవీన్‌కుమార్ గత కొంత కాలంగా రాయచోటి పట్టణం పార్థసారథి వీధిలో నివాసం ఉంటున్నాడు. అలాగే పూలకుంట మహేష్ సత్యసాయి జిల్లా కదిరి రెడ్డివారిపల్లెకు చెందిన వాడు. పెమ్మా నవీన్ కుమార్ ఎంసీఏ, పూలకుంట మహేష్ ఎంబీఏ వరకు చదివారు. అయితే వీరిద్దరూ జల్సాలకు అలవాటు పడి అక్రమంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అడ్డదారులు తొక్కారు. ఈ క్రమంలోనే నిరుద్యోగులకు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి వారి నుంచి రూ.లక్షల రూపాయలు దోచుకున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో డ్రైవర్ ఉద్యోగంతో పాటు మరికొన్ని ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. నందలూరి రామాంజులరెడ్డి అనే వ్యక్తి మరదలికి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.1.5లక్షలు తీసుకొన్నారు. అలాగే చిన్నమండెం మండలంలో ఒకరు, రాయచోటి టౌన్‌లో మరో ముగ్గురు, బి. కొత్తకోటకు చెందిన మరో వ్యక్తి నుంచి రూ.6లక్షలు తీసుకున్నారు. విజయనగరం జిల్లాలో 16 మంది నుంచి రూ.55 లక్షలు తీసుకున్నారు. మరో 5 మంది నుంచి రూ.18లక్షలు ఇలా మొత్తం రూ.73 లక్షలు వసూలు చేశారు. నిరుద్యోగులను నమ్మించడానికి వీరు ప్రభుత్వ సీళ్లను కూడా తయారు చేయించారు. అలాంటి 12 సీళ్ల వారి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వారు ఉద్యోగం ఇప్పించకపోగా తప్పించుకొనే ప్రయత్నం చేయడంతో బాధితులు రాయచోటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి నిందితులను రాయచోటి పట్టణంలో అరెస్టు చేశారు. వారి నుంచి 2 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్ ట్యాప్, 12 ప్రభుత్వ నకిలీ సీళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పెడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

వల్లూరు : మండల పరిధిలోని గోటూరులో ఈ నెల 10 తేదీన గ్రామానికి చెందిన పెద్ద సుబ్బరాయుడుపై పొలం తగాదా విషయమై అతని తమ్ముడు లక్షుమయ్య, అతని కుమారుడు లక్ష్మణరావులు కలిసి దాడి చేసిన సంఘటనకు సంబంధించి గురువారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మండల పరిధిలోని తోల్లగంగనపల్లె బస్టాపు సమీపంలో వీరిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

107 చౌక బియ్యం బస్తాలు పట్టివేత

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలో వేర్వేరు చోట్ల విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి 107 చౌక బియ్యం బస్తాలు, ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు మండల తహశీల్దార్ రమేష్ తెలిపారు. బుధవారం రాత్రి తాడిపత్రి రహదారిలో 72 బస్తాలు, అలాగే బొలెరో వాహనంలో తీసుకెళ్తున 35 బ్యాగులను, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు పంపిణీ


కానిస్టేబుల్ సతీమణికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : ఆర్‌కే వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ జి. వెంకట శివ (పిసి 2860) సతీమణి లక్ష్మీ ప్రసన్నకు రూ. 21.40 లక్షల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందదర్భంగా కానిస్టేబుల్ వెంకట శివ కుటుంబీకుల యోగక్షేమాలు విచారించారు. కుటుంబానికి పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ జ్యోతి, పి-సెక్షన్ సూపరింటెండెంట్ ఈ.సురేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని పెన్నానది ఒడ్డు సమీపంలో కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి (38) మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. ముక్తియార్ ఆయిల్‌మిల్లు వెనుక భాగంలోని పెన్నానది సమీపంలో శశికుమార్ అనే వ్యక్తి ఒక షెడ్డును ఏర్పాటు చేసుకొని పందెం ఎడ్లను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం గుర్తు తెలియని ఒక వ్యక్తి ఆ ప్రాంతానికి వచ్చాడు. ఎద్దులకు హాని తలపెట్టడానికి వచ్చాడని భావించిన శశికుమార్, రెడ్డయ్యతో పాటు కొందరు అతన్ని కొట్టి గాయపరిచారు. దీంతో అతను కొద్దిసేపటి తర్వాత మృతి చెందాడు. విషయం తెలియడంతో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, సీఐ యుగంధర్, ఎస్ఐ చిరంజీవిలు సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పరిశీలించి ఆ ప్రాంత వాసులను విచారించారు. స్థానికులను పిలిపించి మృతదేహాన్ని చూపించగా తెలియదని, అతను కొత్త వ్యక్తి అని చెప్పారు. సోములవారిపల్లె వీఆర్ఓ అమర్‌నాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఆటో బోల్తా ఇద్దరికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దొరిచెరువు వద్ద ఆటోబోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం లక్కిరెడ్డిపల్లి నుండి వారి స్వగ్రామమైన చెంచర్లపల్లెకు ఆటో బాడుగకు తీసుకొని వెళ్తుండగా దొరిచెరువు వద్ద కాలువలోకి దూసుకువెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న వేముల రమణమ్మ, వేముల రెడ్డమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 108 వాహనం ద్వారా లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యానిమేటర్ చేతివాటం

- డ్వాక్రా మహిళలకు సంబంధించి రూ.30లక్షల స్వాహా


డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న సీఐ బాలమద్దిలేటి, తదితరులు

తొండూరు : స్వయం సహాయక సంఘాల్లో పని చేస్తున్న ఓ యానిమేటర్ చేతివాటం ప్రదర్శించి దాదాపు రూ.30లక్షలు స్వాహా చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.వైఎస్సార్ జిల్లా తొండూరు పోలీసు స్టేషన్‌లో మండల పరిధిలోని సంతకొవ్వూరు పంచాయతీ పరిధిలో గల గంగనపల్లె గ్రామంలో దాదాపు 18డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. అందుకు సంబంధించి గ్రామానికి చెందిన హెనిమ అనే మహిళ యానిమేటర్‌గా పనిచేస్తోంది. గ్రామంలో అన్ని డ్వాక్రా సంఘాల మహిళలతో కలిసిమెలిసి అందరితో ఆప్యాయంగా పలకరిస్తుండటంవల్ల నమ్మకం ఏర్పడింది. దీంతో అదే అదునుగా భావించి డ్వాక్రా సంఘాల బ్యాంకు అధికారులతో చాకచక్యగా మాట్లాడుతూ అంతా తానే అంటూ బ్యాంక్ చెక్‌బుక్‌లు కూడా పుట్టించుకుంది. తన సంతకంతో 18సంఘాలకు సంబంధించిన లావాదేవీలను సాగిస్తూ స్వాహాకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించి పులివెందుల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో లావాదేవీలు జరుగుతున్నాయి. అయితే యానిమేటర్ తన చేతివాటం ప్రదర్శనకు డ్వాక్రా సంఘాల అధికారులు, బ్యాంకు అధికారులు పూర్తిగా సహకరించినట్లు సంఘాల సభ్యులు సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ హనుమంతుల ఎదుట వాపోయారు.

సీఐ, ఎస్ఐల విచారణ :

గంగనపల్లె గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు సంబంధించి యానిమేటర్ మోసం చేసిన విషయాన్ని గ్రామస్తులందరూ చర్చించుకున్నారు. అయితే అక్కడ పంచాయతీ కొలిక్కి రాకపోవడంతో గురువారం తొండూరు పోలీస్‌స్టేషన్‌కు డ్వాక్రా సంఘాల సభ్యులు చేరుకుని ఎస్ఐ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఎస్ఐ డ్వాక్రా సంఘాలు, బ్యాంకు అధికారులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు.సీఐ బాలమద్దిలేటి కూడా డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి, మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లగొండువారిపల్లెలో యానిమేటర్లు చేతివాటం ప్రదర్శించి డ్వాక్రా మహిళల సొమ్మును కాజేశారు. డ్వాక్రా మహిళలు అప్పును సక్రమంగా చెల్లిస్తున్నా.. బ్యాంకులలో తీసుకున్న అప్పుకు వడ్డీలు అధికంగా వస్తుండటంతో బ్యాంకుకు వెళ్లి డ్వాక్రా మహిళలు అధికారులను అడిగారు. మీరు అప్పును సక్రమంగా చెల్లించలేదని, డ్వాక్రా కంతులు సక్రమంగా కట్టకపోవడంవల్ల వడ్డీలు పెరుగుతున్నాయని బ్యాంకు అధికారులు సమాధానమిచ్చారు. దీంతో కంగుతిన్న డ్వాక్రా మహిళలు యానిమేటర్ల చేతిలో మోసపోయినట్లు తెలుసుకుని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మా గ్రామంలోనే 11గ్రూపులు ఉన్నాయుని.. దాదాపు రూ.10 లక్షలకుపైగా డ్వాక్రా యానిమేటర్లు స్వాహా చేశారని.. అన్ని గ్రూపుల లావాదేవీలు విచారిస్తే ఎంతోమంది బాధితులు బయటకు వస్తారని డ్వాక్రా మహిళలు అంటున్నారు. అధికారులు తమకు తగిన న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు.

గుండెపోటుతో ఎస్ఈబీ హెడ్ కానిస్టేబుల్ మృతి


నాగేశ్వరరెడ్డి (ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఎస్ఈబీ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్.నాగేశ్వరరెడ్డి బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప పట్టణంలోని నివాసముంటున్న నాగేశ్వర రెడ్డి పట్టణంలోని ఎస్ఈబీ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే కడప నుంచి పులివెందులకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో ఆయనకు గుండెపోటు రావడంతో తోటి కానిస్టేబుళ్లు చికిత్స కోసం పులివెందులలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో కడపకు రెఫర్ చేశారు. వాహనంలో కడపకు తీసుకెళుతుండగా నాగేశ్వరరెడ్డి మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్ఈబీ పోలీసులు తెలిపారు. మృతుడు నాగేశ్వరరెడ్డికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు, ఎస్ఐ కళ్యాణ్ కుమార్‌లతోపాటు పోలీసు సిబ్బంది నాగేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మానవత్వం చాటిన సీఐ

- హత్య కేసులో భర్త జైలుకు..
- పూట గడవక భార్యా పిల్లలు
- సరుకులు అందజేసిన సీఐ ఇబ్రహీం


ఓబులేసు భార్యకు నిత్యావసర సరుకులను అందచేస్తున్న సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం : కుటుంబ యజమాని హత్య కేసులో జైలుకు వెళ్లాడు. కుటుంబాన్ని పోషించాల్సిన వ్యక్తి జైలుపాలు కావడంతో అతని భార్యా పిల్లలు తినడానికి తిండి లేక ఇబ్బందులు పడేవారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ సీఐ ఇబ్రహీం ఆ కుటుంబం పట్ల పెద్ద మనసు చాటుకున్నారు. వాజ్‌పేయ్‌నగర్‌కు చెందిన లచ్చగాళ్ల కోడూరు చిన్న ఓబులేసుతో పాటు ప్రసాద్‌లు వాచ్‌మెన్‌గా పని చేస్తున్న పుల్లయ్యను కొట్టడంతో చికిత్స పొందుతూ అతను చనిపోయాడు. దీంతో ఇరువురిని టూ టౌన్ పోలీసులు రిమాండుకు తలించారు. ఓబులేసు జైలుకెళ్లడంతో ఏ పాపం ఎరుగని అతని భార్య దుర్గ, ఏడాది కూడా నిండని కుమార్తె కుటుంబ పోషణ కరువై ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో టూ టౌన్ సీఐ ఇబ్రహీం గురువారం ఆమెను స్టేషన్‌కు పిలిపించి నిత్యావసర సరుకులను అందచేశారు. మానవత్వం చాటిన సీఐని ఎస్పీ అభినందించారు.